
ప్రజాశక్తి
బుధవారం 12 జూన్ 2024



చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కుటుంబ సభ్యులతో ఉండవల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. కురుపాంలో 30ఏళ్ల తర్వాత టిడిపి విజయం సాధించడం, జగదీశ్వరి ఎమ్మెల్యేగా గెలుపొందడం పట్ల చంద్రబాబు అభినందించారు. బాగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి జగదీశ్వరి వివరించారు.



చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రమాణ స్వీకారానికి తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సిఎం ప్రమాణ స్వీకారానికి తెలుగు తమ్ముళ్లు విజయవాడలోని కేసరపల్లికి తరలివెళ్లారు. కొందరు బస్సుల్లోనూ, మరికొందరు రైళ్ల, ఇంకొందరు కార్లలోనూ మంగళవారం ఉదయం నుంచి ప్రయాణం మొదలుపెట్టారు. దీనికి సంబంధించి టిడిపి, జనసేన పార్టీలకు చెందిన విఐపిలు, వివిఐపిలకు గడిచిన రెండురోజులూ ప్రత్యేక ఆహ్వానాలు అందాయి. కారు ఎంట్రీ పాసులను కూడా జారీచేశారు. ముఖ్యంగా ప్రభుత్వం తరపున ప్రతి నియోజక వర్గానికి నాలుగు బస్సులు చొప్పున విజయనగరం జిల్లాలో 28 బస్సులు, పార్వతీపురం మన్యం జిల్లాలో 16 ఏర్పాటు చేశారు. ఈ లెక్కన మండలానికి ఒకటి చొప్పున బస్సులను కేటాయించారు. ప్రతి గ్రామం నుంచీ కనీసం ఒక ప్రతినిధిని బస్సుల్లో పంపే విధంగా ఏర్పాట్లు చేశారు. ఇవి కాకుండా స్థానిక ఎమ్మెల్యేలు ప్రత్యేక వాహనాలను పార్టీ తరపున, వ్యక్తిగతంగాను బుక్ చేశారు. ఈ బస్సులన్నీ మంగళవారం మధ్యాహ్నం నుంచి బయల్దేరాయి. ఈ మేరకు ప్రభుత్వం తరపున జిల్లా అధికారులే బస్సులను సమకూర్చారు. ఇందులో ప్రయాణించేవారి దారి ఖర్చులు, భోజనాలు, తదితరాలన్నీ ఎమ్మెల్యేలు, నాయకులు చూసుకుంటున్నట్టుగా సమాచారం. ఈనేపథ్యంలో టిడిపి నాయకులు, క్రియాశీలక కార్యకర్తల్లో కొత్త జోష్ కనిపిస్తోంది. ప్రమాణ స్వీకారానికి వెళ్లే నాయకులు, కార్యకర్తలకు ప్రభుత్వం తరపున పాసులు కూడా అందజేశారు. ఈ లెక్కకు మించి తెలుగు తమ్ముళ్లు బయలుదేరారు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి టిడిపి జిల్లా కార్యాలయం (అశోక్ బంగ్లా) సందడిగా కనిపించింది. ఇక్కడి నుంచి బయలుదేరిన కార్లు ప్రత్యేక కాన్వాయ్‌ని తలపించాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్లా జనసైనికుల ప్రయాణం కూడా ఎక్కువగానే కనిపించింది. ఇలా వెళ్లిన నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గాల వారీగా కూర్చొనేందుకు వీలుగా అక్కడి ప్రమాణ స్వీకార సభలో ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. అక్కడ ప్రతి గ్యాలరీకి ఒకటి లేదా రెండు చొప్పున ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేయనున్నట్టుగా సమాచారం. జిల్లా ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని వీక్షించే విధంగా జిల్లా కేంద్రాలు, మండలంలోని ముఖ్యమైన కూడళ్లలో ఎల్ఎడి స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. విజయనగరంలోని కలెక్టరేట్, ఆనందగజపతి ఆడిటోరియంలో ప్రత్యక్ష ప్రసారాలు నిర్వహించనున్నారు.

ఎవరికి వారే తమ ఎమ్మెల్యేకు రాష్ట్ర మంత్రి పదవి వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు రెండు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలంతా రెండు రోజుల క్రితమే విజయవాడ చేరుకుని పార్టీ అధినేతలు నారా చంద్రబాబు నాయుడు, లోకేష్‌లను కలిసిన సంగతి తెలిసిందే. మంగళవారం జరిగిన టిడిపి, ఎన్‌డిఎ శాసనసభా పక్ష సమావేశాల్లో పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ప్రభుత్వ భవనాలు, చారిత్రక కట్టడాలు, ఆలయాలు, ముఖ్యమైన కూడళ్లను ప్రత్యేక విద్యుత్తు అలంకరణ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో విజయనగరంలోని పైడితల్లమ్మ ఆలయం, కోట, గంటస్తంభం, మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల, సంస్కృత కళాశాల, కలెక్టరేట్, మర్రి చెన్నారెడ్డి భవన్, మున్సిపల్, ఆర్అండ్‌బి, జెడ్‌పి, దేవాదాయ శాఖ కార్యాలయ సముదాయాలు సోమవారం రాత్రి నుంచి విద్యుత్తు అలంకరణ చేశారు.

నియోజకవర్గానికి నాలుగు బస్సులు దేశం నేతల్లో జోష్



చంద్రబాబు ప్రమాణస్వీకారానికి విజయవాడ వెళ్తున్న గుమ్మలక్ష్మీపురం మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు

చంద్రబాబు ప్రమాణస్వీకారానికి తరలివెళ్తున్న టిడిపి శ్రేణులు

కురుపాం: చంద్రబాబు ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో మండలంలో గల మొండెంఖల్‌కు చెందిన మాజీ జిల్లా కో ఆప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో మొండెంఖల్, ఉదయపురం, బొడ్డమానుగూడ, నీలకంఠాపురం తదితర గ్రామాల నుండి పెద్ద ఎత్తున టిడిపి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు బస్సులు, కారుల ద్వారా మంగళవారం సాయంత్రం తరలి వెళ్తున్నారు.

గుమ్మలక్ష్మీపురం : బుధవారం అమరావతిలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు అమరావతికి పెద్ద సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. మండలంలోని 27 పంచాయతీల నుంచి మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు ఆధ్వర్యంలో నాయకులు గుమ్మలక్ష్మీపురం నుంచి మంగళవారం మధ్యాహ్నం బయలుదేరి వెళ్లారు.

భామిని: రాష్ట్ర ముఖ్యమంతిగా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎంగా పవన్ కల్యాణ్, రాష్ట్ర కేబినెట్ మంత్రులు ప్రమాణ స్వీకారానికి మండల టిడిపి అధ్యక్ష ప్రధాన అధ్యక్షులు రవి నాయుడు, మెడిబోయిన జగదీశ్వరావు ఆధ్వర్యంలోని టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున విజయవాడ పయనమయ్యారు. కార్యక్రమంలో భామిని సర్పంచ్ లోపింటి రాజేష్, సునీల్ సంత్రో, తదితరులు పాల్గొన్నారు.

ఎపిఇఏపిసెట్‌లో
మెరిసిన జిల్లా విద్యార్థులు

ప్రజాశక్తి - వీరఘట్టం

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఎపి ఇఏపిసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. మండలంలోని రేగులపాడుకు చెందిన మెరుగులు యశస్వి మంగళవారం వెలువడిన ఎపి ఇఏపిసెట్‌లో 115.9 మార్కులు సాధించి రాష్ట్రంలో 378 ర్యాంక్ సాధించినట్లు తల్లిదండ్రులు రవికుమార్, చందన తెలిపారు. యశస్వి కృతిమ మేధా టెక్నికల్ చదివేందుకు ఆశపడుతున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. అలాగే నడుకూరుకు చెందిన గొర్లె పవన్ కుమార్ 135 మార్కులు సాధించి 89వ ర్యాంకు సాధించినట్లు తండ్రి తండ్రి ప్రసాద్ తెలిపారు.

మక్కువ : మండలంలోని మక్కువకు చెందిన పొడుగు రాహుల్79వ ర్యాంకు సాధించారు. అలాగే ఇటీవల విడుదలైన జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చాడు. జెఇఇలో 119వ ర్యాంకు సాధించారు. దీంతో రాహుల్‌ను తల్లిదండ్రులు, తోటి స్నేహితులు అభినందించారు.


విజయనగరంటౌన్, బొబ్బిలి : విజయనగరం జిల్లాలో డి.శ్రీనిధి 55వ ర్యాంక్, బి.సందీప్ శంకర్ 312, ఆర్‌జి ఎస్ఆర్ శ్రీవత్స 995, ఎస్.రోషిణి 1640, ఎన్.నాగ ఈశ్వర్ అక్షయ్ 2069, టి.అభినయ కార్తీక్ వర్మ 2786, ఎన్.సాయిగణేష్, 2844, తొత్తడి ప్రవీణ్ 1361 ర్యాంకులు సాధించారు.

శరణ్యకు 126వ ర్యాంకు

బొబ్బిలి పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన డోకుల శరణ్య.. ఫార్మసీలో 126వ ర్యాంకు సాధించింది. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో కూడా శరణ్య జాతీయ స్థాయిలో 2041వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 704వ ర్యాంకు సాదించింది. శరణ్య తండ్రి వెంకటరమణ ప్రభుత్వ ఉపాధ్యాయులు, తల్లి అరుణ గృహిణి. శరణ్య మంచి ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పక్కి గ్రామానికి చెందిన శంబంగి శరణ్య ఫార్మసీలో 138వ ర్యాంకు సొంతం చేసుకుంది. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో శరణ్య జాతీయ స్థాయిలో 2928వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 1039వ ర్యాంకు సాధించింది. శరణ్య తండ్రి శ్రీనివాసరావు ప్రభుత్వ ఉపాధ్యాయులు, తల్లి పార్వతి గృహిణి. కుమార్తె మంచి ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంజినీరింగ్



డి.శ్రీనిధి
55వ ర్యాంకు



జి.పవన్‌కుమార్
89వ ర్యాంకు



బి.సందీప్ శంకర్
312వ ర్యాంకు



ఎం.యశస్వి
378వ ర్యాంకు

ఫార్మసీ



డి.శరణ్య
126వ ర్యాంకు



ఎస్.శరణ్య
138వ ర్యాంకు

విద్యుత్ కాంతులతో కలెక్టరేట్

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం బుధవారం కొలువుదీరనున్న నేపథ్యంలో జిల్లాలో పలు ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్నాయి. సిఎం చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవం పండగ వాతావరణంలో నిర్వహించాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లాలోని 15 మండలాల్లో ఎంపిక చేయబడ్డ గ్రామ సచివాలయాల్లో ప్రత్యక్ష ప్రసారాల వీక్షణకు ఏర్పాట్లు చేశారు. మండలంలో ఎంపిడిఒ జావేద్ ఆధ్వర్యంలో నర్సిపురంలోని డిపిఒ కార్యాలయంతో పాటు మండల పరిషత్ కార్యాలయం, ఎంఆర్ నగరం, పెద్ద బొండపల్లిలో సచివాలయ భవనాలకు విద్యుత్ అలంకరణతో ముస్తాబులు చేసి ప్రమాణ స్వీకారం లైవ్ కొరకు ఎల్ఇడి టీవీలను ఏర్పాటు చేస్తున్నారు.

పార్వతీపురం టౌన్: చంద్రబాబునాయుడు సిఎంగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం, జిల్లా ప్రభుత్వ కార్యాలయాల సముదాయం భవనాలు విద్యుత్ దీపాల అలంకరణతో దగదగ మెరుస్తున్నాయి.

వీరఘట్టం : మండల కేంద్రంలోని తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు విద్యుత్ దీపాల అలంకరణతో వెలుగులు వెదజల్లుతున్నాయి.



విద్యుత్ కాంతులతో విరజిల్లుతున్న కలెక్టరేట్



ఒకే వేదిక మెరిసిన ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విజయవాడ ఎ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఎన్‌డిఎ శాసనసభ పక్ష నేత ఎన్నిక సభలో ఉమ్మడి జిల్లాల నుంచి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఒకే వేదికపై కనిపించారు. వీరిలో కురుపాం, సాలూరు, ఎస్.కోట, విజయనగరం, నెల్లిమర్ల, పార్వతీపురం, బొబ్బిలి, విజయ నగరం, చీపురుపల్లి ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, గుమ్మడి సంధ్యారాణి, కోళ్ల లలిత కుమారి, అదితి విజయలక్ష్మి, లోకం మాధవి, బోనెల విజయ్ చంద్ర, బేబి నాయన, కొండపల్లి శ్రీనివాసరావు, కళా వెంకట్రావు ఉన్నారు.

పైరవీలు చేసుకో... పనులు తప్పించుకో

- ప్రసన్నం చేసుకోలేని వారిపైనే పని భారం
- తరచూ సిబ్బంది మధ్య అంతర్గత గొడవలు
- ఇదీ శంబర పిహెచ్‌సి పరిస్థితి



ప్రజాశక్తి - మక్కువ

'వడ్డించేవాడి వాడు మనవాడైతే కడబంతిలో కూర్చొన్నా ఫర్వాలేదు' అన్న చందంగా ఉంది మండలంలోని శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వర్తిస్తుందనలో ఎటువంటి అతిశయోక్తి కాదు. పైరవీరుల్లో ప్రావీణ్యం ఉంటే ఇక్కడ ఉద్యోగం చేసినట్టే. విధులకు డుమ్మా కొడుతూ ఇంకెక్కడైనా గడిపేయవచ్చు అన్నట్లుగా కొంతమంది సిబ్బందిపై పనితీరుపై సర్వత్రా విమర్శలు వెళ్లివెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన సచివాలయ వైద్య సిబ్బంది కూడా ఇదే పంథాను కొద్దిమంది అనుసరిస్తూ విధులు నిర్వహించే వారిని అప్పట్లో పలు ఆరోపణలు వచ్చాయి. ఇటీవల మార్చి 16 తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన దరిమెలా ఏ విధమైన డిప్యూటేషన్లకు ఎన్నికల సంఘం అనుమతి లేదంటూ ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ ఇక్కడ పని చేసే ఓ సూపర్వైజర్ డిఎంహెచ్ఒ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై ఇప్పటికీ విధులు నిర్వహిస్తుండడం గమనార్హం. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు సూపర్వైజర్లు పనిచేస్తున్నారు. ఎక్కువ శాతం గిరిజన ప్రాంతం ఉండడంతో ఆయా గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.జీ నేపథ్యంలో ఉన్న సూపర్‌వైజర్‌ను డిప్యూటీపై వెళ్లిపోవడంతో గిరిజనులకు ఆరోగ్య సలహాలు, సూచనలు సకాలంలో ఇవ్వడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దిగువ స్థాయి సిబ్బందిని గత కొంతకాలంగా వివక్ష కొనసాగుతుందన్న చర్చ జరుగుతోంది. సిబ్బందిలో నచ్చిన వారికి ఒకలా, నచ్చనివారికి మరోలా బాధ్యతలు అప్పగిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల అలసత్వం వల్ల సిబ్బంది ఎవర్నీ ఏమీ అనలేని దుస్థితి ఏర్పడింది. ఒకవేళ ఎవరిని ఏమన్నా ఏ విధమైన గొడవలు వస్తాయోనని సర్దుకుని పోవాల్సిన పరిస్థితి పిహెచ్‌సిలో నెలకొందన్న చర్చ వినిపిస్తుంది.

ఉన్నతాధికారుల ఆదేశాలు ప్రకారమే..

ఎన్నికల నిబంధనలను గురించి తనకు పెద్దగా తెలియదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే డిప్యూటేషన్‌పై సూపర్వైజర్‌ని పంపినట్లు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. ఏమైనా పనులుంటే అక్కడ నుంచే ఇక్కడ పని చేస్తున్నారని 'ప్రజాశక్తి కి ఆయన తెలిపారు

ఎక్కడైనా నాకు ఒకటే..

పనిచేసే నైపుణ్యం తన వద్ద ఉన్నందున జిల్లా కేంద్రంలో జిల్లా అధికారులు తనతో పని చేయించుకుంటున్నారని సూపర్వైజర్ అన్నారు. పైరవీలు చేసి తాను జిల్లా కేంద్రంలో విధులు నిర్వర్తించలేదన్నారు. పనిచేసే వారికి ఎక్కడైనా ఒకటైనను ఆమె బదులు ఇచ్చారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ పారిశుధ్య డ్రైవ్ ముమ్మరంగా సాగుతున్నాయి. మంగళవారం పెద్ద ఎత్తున డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా సీతానగరం మండలంలోని కాసాపేట, చినభోగిల, లచ్చయ్యపేట, అంటిపేట తదితర గ్రామాల్లో ని కాలువల్లో పూడిక తీత, దోమల లార్వా నివారణ పిచికారీ (ఎఎల్ఒ) కార్యకలాపాలను చేపట్టారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా, దోమలు వ్యాప్తిని అరికట్టేందుకు లార్వా నిరోధక రసాయనాలను పిచికారీ చేయించారు. పూడికలు, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, బావులు, కొళాయిలు, బోరుల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా వివిధ పనులు చేపట్టారు. జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇప్పటి నుంచే మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రభలకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాల మేరకు దోమలపై దండయాత్ర చేపట్టారు. జిల్లాలో దోమల వ్యాప్తి నివారణకు విధిగా అన్ని గ్రామాల్లో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించి లార్వా వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. తాగునీటి సరఫరా పైపుల పరిస్థితి తనిఖీ, తాగు నీరు కలుషితం కాకుండా శ్రద్ధ వహించారు. బ్లీచింగ్ వేయడం, తుప్పలు తొలగింపు, బహిరంగ మలవిసర్జనకు చర్యలు చేపట్టారు. ప్రజారోగ్య ఆవశ్యకత దృష్ట్యా పలు కార్యక్రమాలను నిర్వహించారు.

కొత్తవలసలో...

పాచిపెంట : మండలంలోని కొటికిపెంట పంచాయతీలో గల కొత్తవలసలో సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య కార్మికులతో పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలు రోడ్లపై చెత్త చెదారాలు కార్మికులతో తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పలనాయుడు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని ముఖ్యంగా దోమల బెడద తగ్గి మలేరియా, టైఫాయిడ్. డెంగీ వంటి వ్యాధులు సోకకుండా నివారించవచ్చని, గ్రామస్తులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.



సీతానగరం : కాసాపేటలో పూడికలు తీస్తున్న పారిశుధ్య సిబ్బంది

15న క్రీడా పాఠశాలకు ఎంపికలు

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 15న విశాఖపట్నంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన నడుస్తున్న స్పోర్ట్స్ హాస్టల్‌లో బాలురకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిబాబు, కెవిఎన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు అత్యుత్తమ క్రీడా వసతులతోపాటు నిష్ణాతులైన శిక్షకులతో వాలీబాల్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రీడా శిక్షణతోపాటు ఎంపికైన క్రీడాకారులు చదువును కూడా కొనసాగించవచ్చని చెప్పారు. ఆసక్తి ఉన్న బాలురు 18 ఏళ్లలోపు వయస్సు ఉండాలని, 190 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలని తెలిపారు. 15న ఉదయం ఎనిమిది గంటలకు విశాఖపట్నం పోర్టు స్టేడియంలో వయస్సు నిర్ధారణ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, క్రీడలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఉంటే తీసుకుని హాజరుకావాలని కోరారు.

విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఖరీఫ్ సాగుకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వరి, వాణిజ్య పంటల విత్తనాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్ కోరారు. మండలంలోని మారుమూల ప్రాంతమైన రాయగడ జమ్ములో గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై వరి, పచ్చిరొట్ట విత్తనాలు, చిరుధాన్యాలు గిరిజన రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు రాయితీలు సద్వినియోగం చేసుకొని పంటలు పండించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. 2024 ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళిక రైతులకు వివరించారు. ఖరీఫ్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పత్తి విత్తనాలను అనధికారికంగా ఎవరూ కొనుగోలు చేయొద్దని సూచించారు. రైతు భరోసా కేంద్రంలో నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచి పత్తిక అమల, ఎంఇఒ సిహెచ్ ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

జియ్యమ్మవలస : రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కురుపాం నియోజకవర్గ తెలుగు రైతు సంఘం అధ్యక్షులు గురాన శ్రీరామమూర్తి నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని పెదబుడ్డిడిలో ఆర్‌బికెలో వరి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంటియు 1064, ఎంటియు 1121, ఎంటియు 1061, ఆర్‌జెఎల్, సాంబ మసూరి లాంటి నాణ్యమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పెదబుడ్డిడి సర్పంచ్ సీమల సుజాత, ఎంపిటిసి సభ్యులు రేవల్ల జ్యోతి రైతులతో కలిసి వరి విత్తనాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్రి గోవింద నాయుడు, సత్యనారాయణ, విఎఎ పవన్, రైతులు పాల్గొన్నారు.

కురుపాం : ఖరీఫ్ సీజన్లో రైతులకు రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఎఒ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ముందస్తు ప్రణాళికతో ఆర్‌బికె కేంద్రాల్లో అవసరమైన విత్తనాలను సిద్ధంగా ఉంచామన్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై వరి విత్తనాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. వరితో పాటు వేరుశనగ, చోడి, ఇతర విత్తనాలు కూడా అందుబాటులో ఉంచామని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



గుమ్మలక్ష్మీపురం : రైతులకు విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్



పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

పూడికతీతలపై కమిషనర్ ప్రత్యేక పర్యవేక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికతీతలపై ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం 'ప్రజాశక్తి' దినపత్రికలో పూడికతీతలు సరే.. పర్యవేక్షణ ఏది అనే కథనంపై స్పందించిన కమిషనర్ మంగళవారంఉదయం మున్సిపాల్టీలోని బెలగాం, 27 వార్డుల్లో జరుగుతున్న పూడికతీతల పనులను ప్రజారోగ్య విభాగం అధికారి సిహెచ్ మురళి, శానిటరీ మేస్త్రీ, సచివాలయాల శానిటరీ సెక్రటరీలతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు, వర్షాలు కురిసే సమయానికి ముందే, వరదనీరు కాలువల ద్వారా వెళ్లేందుకు, కాలువల్లో పేరుకు పూడికలు తొలగించి, ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు ఈ పనులను చేపట్టడం జరుగుతుందని, ఈ పనులపై శానిటరీ మేస్త్రిలు, సచివాలయాల శానటరీ సెక్రటరీలను ప్రత్యేక పర్యవేక్షణ కు వేయడం జరిగిందని అన్నారు.



ఆశ్రమ పాఠశాలలో స్ప్రేయింగ్ చేయిస్తున్న అధికారులు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మలేరియా స్ప్రేయింగ్

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎవరూ మలేరియాన బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో వైద్య సిబ్బంది మంగళవారం మలేరియా స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు తెరుచనున్న నేపథ్యంలో విద్యార్థులకు మంచి చదువుతో పాటు ఆరోగ్యంగా ఉండాలని మలేరియా బారిన విద్యార్థులు ఎవరూ పడకుండా పాఠశాలలు తెరిచే ముందు మలేరియా స్ప్రేయింగ్ చేయించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి ఎల్.గౌరీశ్వరి, వైద్య సిబ్బంది జె.తిరుపతిరావు, సత్యరాజు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

తరగతుల ప్రారంభానికి అనువుగా హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వేసవి సెలవుల అనంతరం ఈనెల 13న పాఠశాలలు పునః ప్రారంభమవుతాయని ఎంఇఒ-1 సామల సింహాచలం తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి హెచ్ఎంలు పాఠశాల వాతావరణం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పన, మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త విద్యార్థుల నమోదును చేపట్టాలన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, షూలు, బెల్ట్ తదితర వస్తువులతో కూడిన స్టూడెంట్ కిట్ల ఇప్పటికే ఎంఇఒ కార్యాలయాలకు చేరాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వాటిని ఆయా పాఠశాలలకు అందజేస్తామన్నారు. విద్యార్థులకు యూనిఫాంలు ఇంకా రావాల్సి ఉందని, వచ్చిన వెంటనే వాటిని కూడా పాఠశాలలకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతామని ఎంఇఒ సామల సింహాచలం పేర్కొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - బలిజిపేట

వాహనదారులు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మోటార్ వెహికల్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని బర్లి వద్ద ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు మంగళవారం నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 12 వాహనాల యజమానులకు జరిమానులు విధించినట్లు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాహనదారులు వాహనాలను నడిపినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలకు సంబంధిత పత్రాలు అన్ని వాహనాల్లో ఉంచుకోవాలని, ఆటోల్లో ముందు సీటింగ్ లేకుండా ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచించారు. ఈ తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.



బొడ్డపాడు శ్మశానవాటికకు వెళ్లే రహదారి ఇదే

శ్మశాన వాటిక రహదారుల అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి -వీరఘట్టం

తమ గ్రామాలను శ్మశాన వాటికల రోడ్లను అభివృద్ధి చేయాలని మండల కేంద్రంతో పాటు బొడ్లపాడు, గడగమ్మ, నడిమికెళ్ల, కిమ్మి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు అధికారులను కోరుతున్నారు. మృతదేహాన్ని శ్మశాన వాటికి తరలించేటప్పుడు సరైన రహదారి సౌకర్యాల్లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. రానున్న రోజులు వర్షాకాలం కావడంతో మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని దష్టిలో పెట్టుకొని శ్మశాన వాటిక రహదారుల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు అధికారులను కోరుతున్నారు.

మలేరియా నియంత్రణకు సమిష్టిగా కృషి

ప్రజాశక్తి -సీతంపేట



సీతంపేట : ర్యాలీలో పాల్గొన్న డిఎంఒ జగన్మోహనరావు

మలేరియా నియంత్రణకు సమిష్టి కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు స్పష్టం చేశారు. మండలంలోని దోనుబాయి పిహెచ్‌సిలో మంగళవారం నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో ఆయన పాల్గొని సమీక్ష జరిపారు. గ్రామాల్లో మలేరియా తదితర జ్వరాలు ఏ మేరకు నమోదవుతున్నాయి. ఏ విధమైన నియంత్రణా చర్యలు చేపడుతున్నారు మొదలైన అంశాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. జ్వరాలను సకాలంలో గుర్తించి, క్షేత్ర స్థాయిలోనే నిర్ధారణ పరీక్షలు జరపాలని ఆదేశించారు. డ్రైడే కార్యక్రమాలు ప్రతి రోజూ నిర్వహించి దోమల లార్వా నిర్మూలన చర్యలను సంబంధిత శాఖల సమన్వయంతో చేపట్టాలన్నారు. ఆరోగ్య సమస్యలు గుర్తించడంలో జాప్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మారుమూల గ్రామీణ ప్రజలకు ఆ పరిధిలో ఉన్న వెల్నెస్ కేంద్రాల్లో వైద్య సేవలందించాలన్నారు. గర్భిణీ, శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా స్థానికంగా అవగాహన ర్యాలీ నిర్వహించి మలేరియా నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎస్.భానుప్రతాప్, ఎఎంఒ సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు, కార్యాలయ సిబ్బంది ప్రసాదరావు, ఇఒ రాజారావు, సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మలేరియా మాసోత్సవ ర్యాలీ మండలంలోని పెదఅంకలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దోమలు, మలేరియా నివారణ చేసుకోవాలని, శుభ్రతను పాటించాలని ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య అధికారి ప్రభుతేజ్, హెచ్ఎస్ గోపాలరావు, ఇఒ సూర్యనారాయణ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సాంబమూర్తి

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొమరాడ

వైద్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో పనిచేస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించి వారిని ఆదుకోవాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు ఎల్లమ్మ డిమాండ్ చేశారు. మండలంలోని రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం ఆశా వర్కర్లతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కొమరాడ, మాదలింగి, రామభద్రపురం పిహెచ్‌సిలున్నాయని, వీటిలో పనిచేస్తున్న ఆశా వర్కర్లు సుమారు 110 మందికి ఉన్నారని అన్నారు. వీరికి కనీస వేతనం రూ.22వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపు ఆపాలని, టిఎ, డిఎలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, టెన్త్ క్లాస్ పాస్ అయిన ఆశా వర్కర్లను ఎఎన్ఎంలుగా నియమించాలని కోరారు. కరోనా బారినపడి మృతి చెందిన ఆశా వర్కర్ల కుటుంబాలకు రూ.50లక్షలు పరిహారం, ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కొత్త ప్రభుత్వమైనా ఆశ వర్కర్లకు అన్ని విధాలా భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

వడదెబ్బలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రస్తుతం ఎండలు తీవ్రతంగా ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురై అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకొని అవగాహన కల్పించాలని వైద్యాధికారి ప్రదీప్ ఆశా కార్యకర్తలకు సూచించారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బయటకు వచ్చేటప్పుడు గొడుగు వేసుకొని వెళ్లేలా, ఎండ వేడిమి తట్టుకునేందుకు చల్లని పానీయాలతో పాటు కొబ్బరి నీరు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఉదయం 10గంటలు, మధ్యాహ్నం 4 గంటల తర్వాత బయటకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలన్నారు. గర్భిణులను ప్రతినెలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లాలని, అలాగే అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టిక ఆహారం అందేలా చూడాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరిగించుకునేలా గర్భిణీలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జనార్ధన్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ కిల్కారికాల్స్‌పై అవగాహన కల్పించడంలో ఆశాలు అనుసరించాల్సిన అంశాలు గురించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రజలు విరోచనాలు, వాంతులకు గురికాకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలన్న అంశాన్ని తెలిపారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లోకి వస్తున్న 104 వాహనాలను వినియోగించు కోవాలని పేర్కొన్నారు. ఆశా యాప్‌లో ఎప్పటికప్పుడు డేటా అప్డేట్ చేయాల్సి ఉందన్నారు. చిన్న పిల్లల్లో కనిపించే చిన్న చిన్న వ్యాధులు ఎలా గుర్తించాలనే అంశంపై వివరించారు. హైరిస్క్ గర్భిణీలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలో డాక్టర్ సంతోష్ కుమార్ సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌వి చింతాడ ఉదయకుమారి మాట్లా డుతూ గర్భిణులకు వైద్య పరీక్షలు సకాలంలో నిర్వహించడంతో పాటు గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పిహెచ్‌సిలో సాధారణ ప్రసవాలు జరిగేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. రక్తహీనత, హైరిస్క్ సమస్యలకు గర్భిణీలు గురికాకుండా వైద్య, సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : వర్షాకాలం ప్రారంభం కానుందని, కావున గ్రామాల్లో వ్యాధులు ప్రభలే ప్రమాదం ఎక్కువగా ఉన్నందున సచివాలయ, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో గ్రామాల్లో పారిశుధ్యం పై తగు చర్యలు తీసుకోవాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పి.జగదీష్, ఎంపిడిఒ పి.శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. ఆశాడే సందర్భంగా మండలంలో గల ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు ఇతర వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి స్థానిక పిహెచ్‌సి ఆవరణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కానుందని, కావున మలేరియా వంటి వివిధ రకాలైన అంటువ్యాధులు ప్రభలే ప్రమాదం ఉన్నందున గ్రామాల్లో ఎల్లప్పుడూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అలాగే కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను భుజించరాదని, మనం నివసించే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తదితరుల సూచనలు చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని, బోరు బావుల దగ్గర నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో మాంసం, కిరాణా దుకాణాల వద్ద వ్యర్థ పదార్థాలు ఉంటే వారిపై పంచాయతీ కార్యదర్శి నోటీసు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జియ్యమ్మవలసలో ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి, ఎంపిడిఒ



పశువులకు సోకే వ్యాధులపై వైద్యులకు, రైతులకు అవగాహన కల్పిస్తున్న గణపతిరావు

పశువ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

రానున్న వర్షాకాలం సీజన్‌లో పశువులకు వ్యాపించే పలు రకాల వ్యాధులపై పశు సంవర్ధక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏరియా పశువైద్య శాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.గణపతిరావు వెల్లడించారు. మండలంలోని ఉల్లిభద్రలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయా గ్రామాల పశుసంవర్ధక శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశుసంవ ర్ధక శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను నిర్దేశించిన సమయంలోగా రైతులకు అందజేయాల్సి ఉందన్నారు. అలాగే పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలకు సంబంధించి సిబ్బంది నిర్దేశించిన సమయంలోగా లక్ష్యాలను అధిగమించాల్సి ఉందన్నారు. మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలను సకాలంలో వేయాల్సి ఉందన్నారు. అదే విధంగా గొర్రెలు, మేకలకు, చీడపారుడు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పశువైద్య సిబ్బంది మంత్రబుడ్డి శ్రీరాములునాయుడు, ఎ.వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం వాలంటీర్ల వినతి


ప్రజాశక్తి - సాలూరు

తమకు చెల్లించాల్సిన రెండు నెలల వేతనాలను చెల్లించాలని కోరుతూ పట్టణంలోని వాలంటీర్లు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో వాలంటీర్లు కమిషనర్ ప్రసన్నవాణిని కలిసి వినతిపత్రం సమర్పించారు. పట్టణంలో 250 మంది వాలంటీర్లకు సంబంధించి రెండు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఈనెల 6తో ఎన్నికల కోడ్ ముగియడంతో వేతనాలు చెల్లించాలని వాలంటీర్లు కోరారు. త్వరలో చెల్లిస్తామని కమిషనర్ ప్రసన్న వాణి చెప్పారు.

నేరాలు ఘోరాలు

బాలుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల



బాలుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నగర పంచాయతీ పరిధి కొండపేటలో బాలుడు అనుమాన స్పదంగా మృతి చెందాడు. మంగళవారం స్థానికులు అందించిన వివరాల ప్రకారం నగర పంచాయతీ పరిధి కొండపేటకు చెందిన కారెపు చైతన్య (15) అనే బాలుడు గ్రామ శివారు కొండపేట- కొత్తపేట రహదారి కొండ వద్ద గాయాలతో అనుమాన స్పదంగా మృతి చెందారు. కాగా గత రెండు రోజులుగా కనిపించక పోవడంతో బందువులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఇంతలో బాలుడు అనుమానస్పద స్థితిలో విగత జీవిగా కనిపించారు. మృతిపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

పురుగులు మందు తాగి వ్యక్తి మృతి

పజాశక్తి - ఆమి

ఆస్తి గొడవల కారణంగా మండల కేంద్రానికి చెందిన వాక రమణ (55) పురుగులు ముందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కథనం ప్రకారం... కొంతకాలంగా వాక రమణ తన తమ్ముడు మధ్య ఆస్తి పంపకాలు విషయంపై చిన్నపాటి తగాదాలు జరుగుతున్నాయి. ఆస్తి పంపకాల విషయమై తమ్ముడు చొరవ చూపనందున మనస్థాపానికి గురైన అన్న వాక రమణ సోమవారం ఉదయం 5 గంటల సమయంలో తమ కళ్ళం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేసినట్లు మృతుని భార్య సరస్వతి తెలిపారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ ఎస్ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

బేటీ బచావో... బేటీ పడావో

ప్రజాశక్తి - పాచిపెంట

ఆడపిల్లను రక్షిద్దాం... ఆడపిల్లను చదివిద్దాం కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని బొబ్బిలివలస, చీపురువలసలో మంగళవారం కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాలు ప్రస్తుతం సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై వారికున్న హక్కులు, చట్టాలపై కళాజాతా కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. అలాగే బ్యాడ్ టచ్ గుడ్ టచ్, పౌష్టికాహారం వినియోగంపై అంగన్వాడీల ఆవశ్యకత మొదలగు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిడిపిఒ బి.అనంతలక్ష్మి, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాజాతా సభ్యులు

సేవలకు ఘన సత్కారం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐగా పనిచేసి అనేక సామాజిక, సేవా కార్యక్రామాలను నిర్వహించి ప్రజల మన్నలను పొందిన సిఐ జై భీమ్‌ను రోటరీ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెసి రాజు, శ్రీ హరి, కార్యనిర్వాహక కార్యదర్శి రామకృష్ణలు మంగళవారం బొబ్బిలి ఎస్ఇబి ప్రాంగణంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ప్రస్తుతం ఆయన బొబ్బిలి నుంచి బదిలీపై వెళ్లి సోంపేట ఎస్ఇబి సిఐగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆయన తన విధులలో భాగంగా బొబ్బిలి కోర్ట్‌కి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన్ను సత్కరించారు. రోటరీ అధ్యక్షులు జెసి రాజు మాట్లాడుతూ బొబ్బిలిలో పనిచేసిన సమయంలో ఆయన రోటరీ తో కలిసి రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ, మత్తుపదార్థాల వినియోగం వల్ల సంభవించే నష్టాలపై యువతకు అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహణ తదితర సామాజిక, సేవ కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. విధులతో పాటు సమాజానికి ఉన్నతమైన సేవలు అందించారని సమాజానికి సేవలు అందించేవారు సత్కారానికి అర్హులని అన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఎస్ఇబి ఎస్ఐలు రామారావు, తిరుపతి రావు సిబ్బంది పాల్గొన్నారు.



జ్యూట్‌మిల్లు స్థలంలో కర్రలు పాతిన కార్మికులు

జ్యూట్‌మిల్లు స్థలాన్ని ఆక్రమించిన కార్మికులు

పిఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి -బొబ్బిలి

శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు స్థలాన్ని కార్మికులు ఆక్రమించారు. జ్యూట్ మిల్లులో పని చేసిన 1300 కార్మికులకు పిఎఫ్ బకాయి సొమ్ము చెల్లించకపోవడంతో కార్మికులకు పించను రావడం లేదు. కొంతమంది కార్మికులకు పిఎఫ్ సొమ్ము అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిఎఫ్ బకాయిలు చెల్లించాలని కోరుతూ మంగళవారం జ్యూట్ మిల్లు స్థలంలో షెడ్లు వేసేందుకు కర్రలు పాతారు. ఈ సందర్భంగా ఆదర్శ కార్మిక సంఘం అధ్యక్షులు వి.శేషగిరి, సభ్యులు చోడిగంజి రమేష్ నాయుడు, పి.కృష్ణ, జి.రామారావు, భుజంగ మాట్లాడారు. కార్మికులకు పిఎఫ్ బకాయిలు చెల్లించకపోవడంతో 1300మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 50 ఏళ్లు దాటిన కార్మికులకు పింఛను అందడం లేదన్నారు. పిఎఫ్ బకాయిలు చెల్లించాలని యాజమాన్యాన్ని, ప్రజాప్రతినిధులను, అధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. పిఎఫ్ బకాయిలు చెల్లించే వరకు స్థలాన్ని తమ ఆధీనంలో ఉంచుతామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- రేగిడి

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించి వాటి నిర్వహణతోనే పర్యావరణ పరిరక్షణ కలుగుతుందని రాజాం న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం రాజాం మండలం, గార్రాజు చీపురుపల్లి గ్రామంలో న్యాయ సేవ సంఘం రాజాం ఆధ్వర్యంలో వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, న్యాయపరమైన అంశాలు, ప్రభుత్వ విధివిధానాలు, ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులు కారణంగా అనేక రోగాలు బారిన పడుతున్నారన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ మొక్కల నాటాలన్నారు. పర్యావరణ సమతుల్యానికి గురుకావద్దని, మొక్కలు నాటడంతో భావితరాల ఆరోగ్యకరమైన, అహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని సూచించారు. పట్టణంలో వ్యర్థాలతో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు ఏర్పాటు చేయ డం పట్ల ఎరువులు తయారుచేసి పంట పొలాలకు సారవంతమైన నేలలు తయారు చేసుకోవచ్చన్నారు. ఎరువులు రైతులకు అమ్మకం ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరి గ్రామాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌విబి కృష్ణ సాయి తేజ్ మాట్లాడుతూ వ్యర్థ పదార్థాలు పట్టణ శివారులో డంపింగ్ యార్డ్‌లో వేయాలని సూచించారు. దీంతో గ్రామాలు, పట్టణాల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. వ్యర్థాల నుంచి ఎరువులు తయారీగా మరల్చడం గొప్ప విషయమన్నారు. ముందుగా న్యాయ మూర్తులు డంపింగ్ యార్డ్ నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జె.రామప్పలనాయుడు, రాజాం బార్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ జయదేవ్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాసరావు, పర్యావరణ పరిరక్షణ సమితి కమిటీ కన్వీనర్ ఆర్‌విఎస్ నాయుడు, రెడ్ క్రాస్ ప్రతినిధులు కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ లక్ష్మణరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇనాం భూములకు పాసుపుస్తకాలు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని చింతలవలస ఇనాం భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చేయాలని సిసిఎల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పాసుపుస్తకాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ఎన్నికలు సమీపించడంతో జారీ కాలేదు. తరువాత వచ్చిన టిడిపి ప్రభుత్వ సమయంలో ఆ భూములు మాన్సాస్‌కు చెందినవని కోర్టులో మాన్సాస్ సంస్థ కేసు వేసింది. ఇన్నాళ్లకు సిసిఎల్ కమిషనర్ తిరిగి ఆ భూముల్లో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సుమారు 384 మంది రైతులకు 174 ఎకరాల పల్లపు భూమి, 340 ఎకరాల మెట్ట భూముల్లో పట్టాలు ఇవ్వనున్నారు. కాగా మొత్తం 905 ఎకరాల్లో ఇనాం భూములున్నట్లు గుర్తించారు. ఇందులో కొంత మాన్సాస్‌కు, మరికొంత ప్రభుత్వానికి ఉన్నట్లు సమాచారం.